బుక్కపట్నంలో బుల్లెట్ ప్రాక్టీస్!

- మండలంలో 'పోలీస్ ఫైరింగ్ రేంజ్' ఏర్పాటుకు చర్యలు
- బుచ్చయ్యగారిపల్లి, చంద్రాయునిపల్లి సమీపంలో స్థలం
- ఇకపై పోలీసులకు తుపాకీ వినియోగంపై శిక్షణ ఇక్కడే
- సర్కారు చర్యలపై ప్రజల హర్షం



చంద్రాయునిపల్లి సమీపంలో జాతీయ రహదారి పక్కన పోలీస్ శాఖకు కేటాయించిన భూమి

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారి పల్లి, చంద్రాయునిపల్లి సమీపంలో త్వరలో పోలీస్ ఫైరింగ్ రేంజ్ ఏర్పాటు కానుంది. విశాలమైన భూభాగంలో కార్యకలాపాలు సాగనున్నాయి. ప్రసిద్ధి గాంచిన పురాతన చెన్నకేశవస్వామి కొండకు ఆనుకొని బ్రిటీష్ వారి హయాంలోనే సిద్ధరాంపురం పొలం సర్వే నంబర్ 574-1వ లెటర్‌లో 4-38 ఎకరాల భూమిని పోలీసు శాఖకు కేటాయించారు. దీనికి ఆనుకుని మరో 9 ఎకరాలు అందుబాటులో ఉంది. మొత్తం 13-38 ఎకరాల భూమిలో 'ఫైరింగ్ రేంజ్' ఏర్పాటుకు జిల్లా పోలీస్ శాఖ కసరత్తు చేస్తోంది. ఫైరింగ్ రేంజ్ ఏర్పాటైతే నిత్యం ఇక్కడ పోలీసులకు శిక్షణ ఇస్తుంటారు. ఈ భూమి జిల్లా కేంద్రం పుట్టపర్తికి కేవలం 11 కిలోమీటర్ల దూరంలోనే ఉండడం గమనార్హం. అది కూడా ముదిగుబ్బ-బుక్కపట్నం-పుట్టపర్తి మీదుగా కోడూరు తోపు వరకు ఏర్పాటు కానున్న 342 జాతీయ రహదారి సమీపంలోనే అందుబాటులోకి రానుండడం విశేషం.

ప్రజల హర్షం..

పుట్టపర్తి కేంద్రంగా సీఎం జగన్ సర్కార్ ఇప్పటికే శ్రీ సత్యసాయి జిల్లాను ఏర్పాటు చేసింది. పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సమీపంలో అన్ని శాఖల భవన సముదాయాల నిర్మాణం కోసం స్థలం పరిశీలన దశలో ఉంది. ఇప్పటికే డీఈఓ కార్యాలయం కొత్తచెరువులో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. బుక్కపట్నంలోని డైట్ కళాశాలలో జిల్లా అటవీశాఖ కార్యాలయం ఏర్పాటు చేశారు. పుట్టపర్తి జిల్లా కేంద్రం కావడం, సమీపంలోనే పలు జిల్లా



కార్యాలయాల ఏర్పాటుతో భూముల ధరలు పెరిగాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా పాలన చేరువైంది. సంక్షేమం ఇంటి వద్దకే చేరుతోంది. ఈ క్రమంలోనే తాజాగా బుక్కపట్నం మండలంలో పోలీసు ఫైరింగ్ రేంజ్ ఏర్పాటు చేస్తుండడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో మరిన్న మంచి రోజులు రానున్నాయనే ఆశాభావంతో ఉన్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు

బుచ్చయ్యగారిపల్లి, చంద్రాయునిపల్లి గ్రామాల మధ్య చెంద్రాయుని కొండ సమీపంలో జాతీయ రహదారి పక్కనే బ్రిటీష్ కాలంలోనే పోలీసు శాఖకు భూమి కేటాయించారు. ఇటీవల ఆ ప్రాంతాన్ని పరిశీలించాం. ఫైరింగ్ రేంజ్ కోసం ఎలా వినియోగించుకోవాలనే దానిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందుకు సాగుతాం. – మాధవరెడ్డి, ఎస్పీ

ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు



ఉప్పినిపల్లిలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి

తనకల్లు: దేశంలో ఎక్కడా లేని విధంగా కుల, మత, రాజకీయ, పార్టీలు, వర్గాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి ముంగిటకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఉప్పినిపల్లి, బొమ్మల కుంట, మండ్లిపల్లి గ్రామాలలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి ప్రత్యేకంగా చొరవ తీసుకొని ఉప్పినిపల్లికి తారురోడ్డు వేయిస్తున్న సందర్భంగా ఆయనకు గ్రామస్తులు గజమాలలు వేసి, హారతులు పట్టి ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ప్రతి కుటుంబం ప్రభుత్వం నుంచి ఎంత మేరకు లబ్ధి పొందింది వివరించారు. ఇంకా సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. మిగిలిపోయిన సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలను వేయించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేయగా.. ఆయా పనుల కోసం ఎస్టిమేషన్లను సిద్ధం చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ సరస్వతీ, ఎంపీడీఓ పూల నరసింహులు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు రామ్‌దేశాయ్, వినోద్‌కుమార్, కో-ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, జేఏసీ కన్వీనర్ హేమశేఖర్‌రెడ్డి, నాయకులు బషీర్ బేగ్, లాయర్ ప్రసాద్, నాగార్జున రెడ్డి, చిదానందరెడ్డి సలీం, బాబ్‌జాన్, గణేష్‌రెడ్డి, సమరసింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

'ఎండీ పాథాలజీ'లో రాష్ట్ర స్థాయి రెండో ర్యాంకు



త్రిలోక్ గాయత్రికి స్వీట్లు తినిపిస్తున్న తల్లిదండ్రులు

ధర్మవరం అర్బన్: పట్టణానికి చెందిన అంబటి త్రిలోక్ గాయత్రి ఎండీ పాథాలజీ పరీక్షలో రాష్ట్ర స్థాయి రెండో ర్యాంకు సాధించింది. అంబటి త్రిలోక్‌నాథ్ కుమార్తె త్రిలోక్ గాయత్రి తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర మెడికల్ కళాశాలలో ఎండీ పాథాలజీ చదువుతోంది. సోమవారం రాత్రి విడుదలైన పరీక్ష ఫలితాలలో ఆమె రాష్ట్ర స్థాయి రెండో ర్యాంకు సాధించింది. మంగళవారం తల్లిదండ్రులు ఆమెకు స్వీట్లు తినిపించి సంబరాలు చేసుకున్నారు. ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు, భర్త ప్రోత్సాహంతో మంచి మార్కులు సాధించానన్నారు.

ఘనంగా పౌర్ణమి గరుడోత్సవం



ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో మంగళవారం పౌర్ణమి సందర్భంగా గరుడోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ దాశెట్టి సుబ్రహ్మణ్యం, ఈఓ వెంకటేషులు, వైస్ చైర్మన్ కుండా చౌడయ్య సమక్షంలో అర్చకులు కోనేరాచార్యులు, భానుప్రకాష్, మకరందబాబు, చక్రదర్‌లు గరుడ వాహనంపై లక్ష్మీచెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేక పూలతో అలంకరించి కొలువుదీర్చారు. పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామిని పూజించారు.

శ్మశాన వాటిక స్థలంలో పనులు ప్రారంభం

తనకల్లు: మండల పరిధిలోని చీకటిమానిపల్లిలో దళితుల శ్మశాన వాటిక స్థలం పనులకు మంగళవారం భూమి పూజ చేశారు. గ్రామంలోని దళితుల శ్మశాన వాటిక కోసం ప్రభుత్వం ఎకరా స్థలాన్ని కేటాయించింది. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్, డాక్టర్ బత్తల వెంకటరమణ సహకారంతో జేసీబీతో శ్మశాన వాటికలో చదును పనులను చేపట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు బైక్ భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ తోపు పారేసు, ఎస్సీ నాయకులు నరసింహులు, రాము, నరసింహులు, శ్రీరాములు, తోపు రమణప్ప తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై నిరసన

కదిరి టౌన్: మణిపూర్ మారణ కాండపై పట్టణంలో మంగళవారం రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ, బహుజన సమాజ్ పార్టీల ఆధ్వర్యంలో నాయకులు నిరసన తెలిపారు. ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ మణిపూర్‌లో ఇద్దరు మహిళలను ఉన్మాదులు నగ్నంగా ఊరేగిస్తున్నా పోలీసులు చోద్యం చూస్తూ మౌనంగా ఉండడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బాధితులకు తక్షణమే రక్షణ కల్పించి, పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డాక్టర్ నాగన్న, ఇలియాజ్, బహుజన పార్టీ నాయకులు కుటాగుళ్ల ప్రసాద్, అరుణ్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

నల్లచెరువు: మండల కేంద్రంలోని కె.పూలకుంట రోడ్డులోని బీసీ బాలుర వసతి గృహాన్ని మంగళవారం నల్లచెరువు పీహెచ్‌సీ వైద్యాధికారి అయినుద్దీన్ పరిశీలించారు. హాస్టల్‌లోని విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. అనారోగ్యంగా ఉన్న ఐదుగురు విద్యార్థులను గుర్తించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డెన్ లక్ష్మినారాయణ, సీహెచ్‌ఓ రామచంద్రారెడ్డి, సూపర్‌వైజర్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ నస్రిన్ భాను తదితరులున్నారు.

మహిళ మృతి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: త్రీటౌన్ పరిధిలోని అరుణోదయ కాలనీకి చెందిన ఫర్వీన్ (35) ఆకస్మాత్తుగా మృతిచెందింది. వివరాలు.. ధర్మవరానికి చెందిన ఫర్వీన్ ఇళ్లలో పాచిపనిచేసుకుంటూ జీవనం సాగిస్తోంది. మంగళవారం సాయంత్రం ఇళ్ల పని ముగించుకొని ఇంటికి వెళ్తూ వాంతులు చేసుకొని కిందపడిపోయింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు రాగానే కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తామని త్రీటౌన్ సీఐ ధరణీకిశోర్ తెలిపారు.

వెతుక్కుంటూ వెళ్లి.. పింఛన్ ఇచ్చి..



బత్తలపల్లిలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్

బత్తలపల్లి: ఎన్ని కష్టాలున్నా 1వ తేదీనే లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్నారు. ఆగస్టు నెలకు గాను మంగళవారం ఉదయానికే 20 శాతం పింఛన్లు పంపిణీ కావడం గమనార్హం. ప్రతి నెలా 1వ తేదీ ఉదయాన్నే లబ్ధిదారుల చెంతకే వలంటీర్లు వెళ్లి పింఛను సాయం అందించేందుకు చర్యలు తీసుకున్నారు. ఉదయం సర్వర్లు బిజీగా ఉంటాయన్న ఉద్దేశంతో మండలంలో కొందరు వలంటీర్లు తెల్లవారుజాము 5 గంటల నుంచే పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. అయితే ఉదయం 6.30 నుంచి సర్వర్‌లు మొరాయించడంతో పంపిణీ సక్రమంగా జరగలేదు. ఆ తరువాత 11 గంటల నుంచి పని చేయడం ప్రారంభించింది. మండలంలో వృద్ధాప్య, వితంతు, వికలాంగ తదితర సామాజిక పింఛన్లు మొత్తం 6,186 ఉన్నాయి. మంగళవారం సాయంత్రం 5 గంటలకు 3,454 మందికి పంపిణీ చేసి 56 శాతం పింఛన్ల పంపిణీ చేశారు. పనులకు వెళ్లి వచ్చిన వారికి పంపిణీ చేయగా రాత్రికి 70 శాతంపైగా లబ్ధిదారులకు సాయం అందించడం గమనార్హం.

నూతన ఓటర్లు ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి



అధికారులు, రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీఓ భాగ్యరేఖ

పుట్టపర్తి అర్బన్: 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు పూర్తయ్యే యువత ఓటు నమోదు కోసం ఫారం 6తో పాటు ధ్రువీకరణ పత్రాలను తప్పని సరిగా సమర్పించాలని పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ సూచించారు. మంగళవారం సాయంత్రం పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయంలో తహసీల్దార్లు, అఖిలపక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఈనెల 21 వరకూ బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే నిర్వహిస్తారన్నారు. తహసీల్దార్లు నవీన్‌కుమార్, కరుణాకర్, రామాంజులరెడ్డి, డివిజనల్ అధికారి జిలాన్, డీటీలు నరసింహులు, తరుణ్‌తేజ్, హరి, రెహమాన్, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటర్ కార్డు ఉండేలా తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ యుగేశ్వరిదేవి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఓటర్ సర్వే కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ కుటుంబంలో వివాహం అయిన వారి జాబితాను సేకరించి నోటీసులు ఇచ్చి డబుల్ ఎంట్రీలు లేకుండా సజావుగా నిర్వహిస్తామని తెలిపారు. మృతి చెందిన వారిని తొలగిస్తామన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు తప్పనిసరిగా ఫారం-6 ద్వారా ఓటర్లు నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్నికల ఉప తహసీల్దార్ అనిల్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది రాజకుమార్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఓటరు సర్వే

అమడగూరు: మండలంలో తహసీల్దార్ వెంకటరెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలు సర్వే నిర్వహించారు. మంగళవారం చీకిరేవులపల్లి, గంగిరెడ్డిపల్లి, శీతిరెడ్డిపల్లి, రెడ్డివారిపల్లి గ్రామాల్లో సర్వేను చేపట్టి ఓటరు జాబితాలో చనిపోయిన వారి పేర్లను తొలగించారు. అలాగే డబుల్ ఎంట్రీలు ఉన్నవాటిని సరి చేశారు. కొత్తగా ఓటర్ల కోసం సంబంధిత పత్రాలను సిద్ధం చేశారు. ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పక్కా ఓటరు జాబితాకు కృషి చేయాలని తహసీల్దార్ ఆదేశించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, వీఆర్‌ఓ మోదీన్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



పిన్నదరిలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

తాడిమర్రి: మండలంలోని పిన్నదరి గ్రామంలో మంగళవారం గ్రామస్తులు మొహర్రం వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కుళ్లాయస్వామి, దస్తగిరి, పెద్దకాశీం తదితర పీర్లను సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు డప్పు వాయిద్యాలు, మేళతాళాలతో గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. రాత్రి 7 గంటలకు జలధికి తీసుకెళ్లారు.

పండుగ వాతావరణంలో..

అమడగూరు: అమడగూరులో మంగళవారం జలధి కార్యక్రమాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పీర్లకు పూజలు చేశారు. బంధువుల రాకతో పండుగ వాతావరణం నెలకొంది.

పేరూరులో..

రామగిరి: పేరూరులో జలధి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీర్లస్వాములను మంగళవారం తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు ఊరేగించారు. జలధికి తీసుకెళ్లారు.

కనగానపల్లిలో..

కనగానపల్లి: మండలంలోని మామిళ్లపల్లిలో మంగళవారం మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. జలధి కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పీర్లస్వాములను అలంకరించి అగ్నిగుండ ప్రవేశం చేయించారు.

చిగిచెర్లలో..

ధర్మవరం రూరల్: చిగిచెర్ల గ్రామంలో మంగళవారం జలధి కార్యక్రమాన్ని గ్రామస్థులు ఘనంగా జరుపుకున్నారు. పెద్దకాశీం స్వామి, చిన్నకాశీం స్వామి, మౌలాలిస్వామి పీర్లు అగ్ని గుండం ప్రవేశం చేశాయి. గ్రామ పెద్దలు పెద్దిరెడ్డిగారి శివారెడ్డి, బుచ్చిరెడ్డి గారి ప్రభాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఓబిరెడ్డి తదితరులు భక్తులకు సౌకర్యవంతంగా ఏర్పాట్లు చేశారు.

ఘనంగా జార్తాల్..

బత్తలపల్లి: జార్తాల్ వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం పోట్లమర్రి, గంటాపురం, వేల్పుమడుగు, ఈదుల ముష్టూరు, రాఘవంపల్లి, లింగారెడ్డిపల్లి, యర్రాయపల్లి, అనంతసాగరం, వెంకటగారిపల్లి, మాల్యవంతం తదితర గ్రామాలలో వేడుకలను ముజావర్లు నిర్వహించారు. పీర్లమకాన్ వద్ద ప్రత్యేక చదివింపులు గావించారు.

నల్లమాడ మండలంలో..

నల్లమాడ: ఎస్.ఎనుములవారిపల్లి, కుటాలపల్లి, తిప్పయ్యగారిపల్లి గ్రామాల్లో మొహర్రం వేడుకల్లో భాగంగా మంగళవారం జలధి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కదిరి టౌన్: సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. కదిరి మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్, సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్, తిరుపాలు, బాలక్రిష్ణ, రాజు, సూరి, సీఐటీయూ నాయకులు జీఎల్.నరసింహులు, జగన్మోహన్, ముస్తక్, ఆంజనేయులు, బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

శవ పంచనామా

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రానికి చెందిన దొరగారి లక్ష్మీదేవమ్మ (60) గత నెల 24న మృతి చెందింది. ఆమె మృతిపై అనుమానం ఉందని కుమార్తె చంద్రకళ 28న స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శ్రీధర్‌కు ఫిర్యాదు చేసింది. పోలీసులు మంగళవారం అనంతపురం మెడికల్ కాలేజీ హెచ్‌ఓడీ గోపాల్ ఆధ్వర్యంలో శవాన్ని వెలికి తీసి పంచనామా చేశారు.

వికసించిన బ్రహ్మ కమలం

నల్లమాడ: మండలంలోని పెమనకుంటపల్లిలో పుట్ల రవీంద్ర ఇంటిముందు సోమవారం రాత్రి 11 గంటల సమయంలో బ్రహ్మ కమలం వికసించింది. బ్రహ్మ కమలాన్ని గ్రామస్తులు ఆసక్తిగా తిలకించి పూజలు నిర్వహించారు.

పోస్టర్ల విడుదల

పుట్టపర్తి టౌన్: మాదిగల హక్కుల పరిరక్షణ కోసం ఈనెల 29న పుట్టపర్తి సాయిఆరామంలో నిర్వహించే రాజకీయ చైతన్య యాత్రను విజయవంతం చేయాలని ఎమ్‌హెచ్‌పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. చలో పుట్టపర్తి పోస్టర్లను మంగళవారం పుట్టపర్తి పట్టణంలో సాయిఆరామంలో విడుదల చేశారు. జిల్లా నాయకులు జింకా నంజప్ప, సుందరాజు, ఆటో నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ



విద్యాసామగ్రితో విద్యార్థులు, దాతలు

పుట్టపర్తి అర్బన్: సత్యసాయి బాబా దర్శనానికి విచ్చేసిన పలువురు విదేశీయుల సహకారంతో ప్రభాత్ రూరల్ దెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో 112 మంది విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేశారు. మంగళవారం పుట్టపర్తి మండలం జగరాజుపల్లి గ్రామంలోని విద్యార్థులకు పలకలు, బ్యాగులు, నోట్‌పుస్తకాలు, తినుబండారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీఆర్‌డీఎస్ ప్రతినిధి ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ పాఠశాలతో పాటు గ్రామ అభివృద్ధి కోసం ఫ్రాన్సెస్కోతమ్మ మెమోరియల్ హాల్ ప్రారంభించామన్నారు. మహిళలకు టైలరింగ్, కంప్యూటర్, స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులపై శిక్షణ ఇస్తామన్నారు. సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో స్కాట్‌లాండ్‌కు చెందిన యాం జెల్‌డిక్సన్, దక్షిణాఫ్రికాకు చెందిన లలితాజవ హరిలాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ బాధితులకు పునరావాస చర్యలు

ధర్మవరం రూరల్: జాతీయ ఫ్లోరోసిస్ నివారణ కార్యక్రమంలో భాగంగా దర్శనమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు పుష్పలత, దిలీప్ కుమార్‌ల ఆధ్వర్యంలో బాధితులకు పునరావాస పరికరాలను(రిహాబిలిటేషన్)ను పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా ఫ్లోరోసిస్ ప్రభావిత ప్రాంతాలను గుర్తించి మంగళవారం సర్వే నిర్వహించారు. అవసరమైన వారికి పునరావాస చర్యలలో భాగంగా 15 నడుము బెల్టులు, 5 మెడ బెల్టులు అందించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కళావతి, ఎంపీహెచ్‌ఈఓ శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సర్వే..

ముదిగుబ్బ: జాతీయ ఫ్లోరోసిస్ నివారణ కార్యక్రమాలలో భాగంగా మలకవేమల ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాలలో వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే చేశారు. డాక్టర్ నారాయణస్వామి, ఆంజనేయులు, శశికళలు పర్యవేక్షించారు. ఫ్లోరోసిస్ బాధితులు 50 మందిని గుర్తించి వారికి అవసరమైన నెక్ బెల్టులు, వాకర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ నాగేంద్రనాయక్, పీహెచ్‌ఎస్ లక్ష్మీ నరసమ్మ, ఎంపీహెచ్‌ఈఓ వేణుగోపాల్‌రెడ్డి తదితరులున్నారు.

వ్యక్తి అదృశ్యం

కదిరి అర్బన్: తన కుమారుడు శ్రీనివాసులు (35) వారం నుంచి కనపడడం లేదంటూ రూరల్‌మండల పరిధిలోని బాలప్పగారిపల్లికి చెందిన గుర్రప్ప మంగళవారం రూరల్ మండల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రాయచోటికి వెళ్తానని చెప్పాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. తెలిసిన వారు, బంధువుల వద్ద ఆరా తీసినా ఫలితం లేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సూర్యనారాయణ తెలిపారు.

సిమెంటు బస్తాల పంపిణీ

గాండ్లపెంట: మండల పరిధిలో జగనన్న కాలనీల్లో గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు హౌసింగ్ ఏఈ చంద్రారెడ్డి మంగళవారం సిమెంటును పంపిణీ చేశారు. మొత్తం 1,080 బస్తాల సిమెంటును లబ్ధిదారులకు అందించినట్లు ఆయన తెలిపారు. విడతల వారీగా బిల్లులు మంజూరు చేస్తామని చెప్పారు.

క్లుప్తంగా

బిడ్డకు తల్లిపాలు వరం



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: బిడ్డకు తల్లి పాలు ప్రకృతి ఇచ్చిన వరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మౌలాబీ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కాళసముద్రం అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బిడ్డ పుట్టగానే తల్లిపాలే ఇవ్వాలన్నారు. బిడ్డ శారీరకంగా, మానసికంగా తల్లిపాలతోనే దగ్గర అవుతుందన్నారు. అపోహలతో బిడ్డకు తల్లిపాలను దూరం చేయడం మంచిది కాదన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు నాగరత్నమ్మ, హరిత, సరస్వతీ, మహేశ్వరీ, ఈశ్వరమ్మ, సుభద్రతో పాటు పలువురు మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

7న చలో విజయవాడ

కనగానపల్లి: రైతు సమస్యలపై ధర్నా నిర్వహించేందుకు ఈ నెల 7న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు మహదేవ తెలిపారు. దీనిపై మండల కేంద్రం కనగానపల్లి మంగళవారం రైతు సంఘం నాయకులు పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు గోవిందు, నాగరాజు, బంగారు ఈశ్వరయ్య, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించండి



ప్రగతి నివేదికలను చదివి వినిపిస్తున్న ఏఈ హరినాయక్

చెన్నేకొత్తపల్లి: గ్రామాల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సహకరించాలని ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవింద రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ గంగావతి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు గుర్తించి, సత్వరమే పరిష్కరించాలన్నారు. అనంతరం అన్ని శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. కార్యక్రమంలో తహసీల్దార్ షాబుద్దీన్, ఏఓ ఉదయ్ కుమార్, హౌసింగ్ ఏఈ హరినాయక్, ఈఓఆర్‌డీ అశోక్ నయాక్, సీడీపీఓ కవితాదేవి, వైస్ ఎంపీపీ రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



పుట్టపర్తిలో నిరసన తెలుపుతున్న కార్మికులు

పుట్టపర్తి టౌన్: మున్సిపాలిటీ కార్మికులందరికి ఉద్యోగ భద్రత కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేషు, యూనియన్ జిల్లా అధ్యక్షులు లక్ష్మినారాయణ మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27న కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు రామయ్య, గోవిందు, నరశింహులు, నాగార్జున, వెంకటేసు, సాయి, వెంకటలక్ష్మమ్మ, అనితమ్మ, రాందాసు, పోతులయ్య, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

తనకల్లు: మండల పరిధిలోని కొర్తికోట సమీపంలో పేకాట ఆడుతున్న ఏడుగురు జూదరులను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాంభూపాల్ తెలిపారు. పేకాట రాయుళ్ల నుంచి రూ.10,300 నగదు, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



షాదిక్‌వలిని సన్మానిస్తున్న ఎస్పీ

పుట్టపర్తి టౌన్: అంకితభావంతో పనిచేసినప్పుడే గుర్తింపు ఉంటుందని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. ధర్మవరంలో హోంగార్డుగా పని చేస్తూ పదవీ విరమణ పొందిన షాదిక్‌వలిని మంగళవారం ఎస్పీ మాధవరెడ్డి తన చాంబర్‌లో మెమెంటో అందజేసి శాలువతో సన్మానించారు. అనంతరం జిల్లాలో హోంగార్డులు ఒక రోజు జీతంగా ఇచ్చిన మొత్తం రూ. 4,42,200 చెక్కు అందజేశారు. ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఆర్ఐలు ఉన్నారు.